# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 18 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మరో 20 దేశాలపై ట్రంప్ ఆంక్షలు..

- 5 దేశాలపై పూర్తిస్థాయి నిషేధం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం ట్రావెల్ బ్యాన్‌ను మరింత విస్తరించింది. ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించిన నిషేధాలను కఠినతరం చేస్తూ మరో 20 దేశాలపై ప్రవేశ ఆంక్షలు విధించింది. ఇందులో ఐదు దేశాల పౌరులపై అమెరికాలోకి పూర్తిస్థాయి ప్రవేశ నిషేధం అమలు చేయగా, మరో 15 దేశాల పౌరులపై పాక్షిక పరిమితులు విధించింది. అమెరికా ప్రయాణం, వలస ప్రవేశ ప్రమాణాలను మరింత కఠినతరం చేయడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇటీవల వైట్ హౌస్ సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డ్ సిబ్బందిని ఒక ఆఫ్గనిస్తాన్ జాతీయుడు కాల్చిచంపిన ఘటన తర్వాత అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలని ట్రంప్ సర్కార్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే జూన్‌లో తొలుత 12 దేశాల పౌరులపై అమెరికా ప్రవేశాన్ని నిషేధించింది. ఆఫ్గనిస్తాన్, మయన్మార్, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ దేశాల పౌరులు ఆ జాబితాలో ఉన్నారు.

మిగితా 4వ పేజీలో

### ప్రాంతీయ శాంతి, భద్రతలో
## భారత్-ఇథియోపియా సహజ భాగస్వాములు

**ఇథియోపియా పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ**



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్, ఇథియోపియా సహజ భాగస్వాములని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇథియోపియాలో ఉంటే సొంతింట్లో ఉన్నట్టుగా అనిపిస్తోందని తెలిపారు. బుధవారం ఇథియోపియా పార్లమెంట్లో ఆయన ప్రసంగించారు. ప్రాచీన జ్ఞానం, ఆధునిక ఆశయాలు కలిగిన ఈ ప్రజాస్వామ్య మందిరంలో ఉండటం గర్వకారణమని మోదీ అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారత్, ఇథియోపియా పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇథియోపియా, గుజరాత్ రెండూ సింహాలకు ప్రసిద్ధి అని గుర్తుచేసిన మోదీ, ఈ దేశంతో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. "ప్రపంచమంతా వసుధైక కుటుంబమే. ఇథియోపియాలో అనేక మంది భారతీయ ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారు. అలాగే ఇక్కడ అత్యధిక విదేశీ పెట్టుబడిదారులుగా భారతీయులే ఉన్నారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నారు" అని పేర్కొన్నారు. ఇథియోపియా పార్లమెంట్, ప్రజలు, వారి ప్రజాస్వామ్య ప్రయాణం పట్ల తనకు లోతైన గౌరవం ఉందని తెలిపారు.

**మోదీకి ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం**

1.4 బిలియన్ భారతీయుల శుభాకాంక్షలను తీసుకొచ్చానని, ఇథియోపియా ప్రజలు, వారి ప్రజాస్వామ్య ప్రయాణానికి గాఢమైన గౌరవం తెలుపుతున్నానని మోదీ అన్నారు. "ఈ భవనంలో ప్రజల

మిగితా 4వ పేజీలో

## మూడో విడతలో కాంగ్రెస్‌దే పైచేయి

- పలు చోట్ల సత్తా చాటిన బీఆర్ఎస్
- మొత్తం 4,141 స్థానాల్లో 2,243 స్థానాల్లో విజయం
- బీఆర్ఎస్ 1,162 స్థానాల్లో, బీజేపీ 245 స్థానాల్లో, ఇతరులు 491
- ప్రశాంతంగా మూడో విడత ఎన్నికలు
- 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో జరిగిన మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు పైచేయి సాధించారు. మొత్తం 4,141 సర్పంచి స్థానాల్లో ఎక్కువ చోట్ల గెలిచి ఆధిక్యాన్ని చాటారు. మంగళవారం రాత్రి కడపటి వార్తలు అందేవరకు వచ్చిన ఫలితాల ప్రకారం కాంగ్రెస్ 2,243 స్థానాల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్ 1,162 స్థానాల్లో, బీజేపీ 245 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. ఇతరులు 491 స్థానాల్లో లీడింగ్‌లో కొనసాగుతున్నారు. తొలి, రెండో దశల మాదిరిగానే మూడో దశలోనూ కాంగ్రెస్ పార్టీ 2,000కు పైగా సర్పంచి స్థానాల్లో గెలుపు జెండా ఎగురవేసింది.

భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, హనుమకొండ, మహబూబాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నల్గొండ, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారు.

| పార్టీలు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| 1). మొదటి విడత | 2,332 | 1,168 | 189 | 537 |
| 2). రెండో విడత | 2,244 | 1,188 | 268 | 626 |
| 3). మూడో విడత | 2243 | 1162 | 245 | 491 |
| మొత్తం | 6819 | 3518 | 702 | 1654 |

మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిలో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు గ్రామ పంచాయతీల్లో న్యాయస్థానం స్టే విధించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. మిగిలిన 3,752 సర్పంచి పదవులకు పోలింగ్ జరగగా, ఫలితాలు దశలవారీగా వెలువడుతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా తొలి రెండు దశల్లో 8,566 గ్రామాల్లో ఎన్నికలు పూర్తవగా, మూడో దశలో 182 మండలాల్లోని 4,159 పంచాయతీలు, 36,452 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 11 పంచాయతీలు, 116 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 2 పంచాయతీలు, 18 వార్డుల్లో కోర్టు స్టే కారణంగా ఎన్నికలు నిలిచాయి. మిగిలిన వాటిలో 394 మంది సర్పంచులు, 7,908 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**22న సర్పంచుల ప్రమాణ స్వీకారం**

పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 22న ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభావృద్ధి శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

**మూడో విడతలో 85.76 పోలింగ్**

చివరి దశ పంచాయతీ ఎన్నికల్లో 85.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ వివరాలను వెల్లడించింది.

మిగితా 4వ పేజీలో

## కొత్త డిస్కంకు ఆమోదం

- ఉత్తర్వులు జారీ చేసిన ఇంధన శాఖ
- ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌కు ఆదేశం
- సబ్సిడీలు, రైతుల ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉన్నాం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం జీవో నెంబర్ 44 విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఇందన శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంల పరిధి ఎక్కువగా ఉండటం, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డిస్కంల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు

మూడో డిస్కం ఉపయోగ పడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలోనే మూడో డిస్కం ఏర్పాటుకు సంబందించి ప్రభుత్వం విధివిదానాలను ప్రకటించింది. మూడో డిస్కం ఏర్పాటుకు సూచించిన విధివిధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) ప్రభుత్వం ఆదేశించింది. ఎల్‌టీ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వినియోగదారులు, స్మార్ట్ మీటర్ హోల్డర్లు, మానవ వనరులను మూడో డిస్కంకు కేటాయించాలని పేర్కొంది. సరిహద్దుల నిర్ధారణ, టీజీ జెన్కో,

మిగితా 4వ పేజీలో

## సిరిసిల్ల గడ్డ గులాబీ అడ్డా.. మరోసారి రుజువు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల నియోజకవర్గం మరోసారి గులాబీ అడ్డా అని నిరూపితమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టి. రామారావు అన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. మొత్తం సిరిసిల్ల నియోజకవర్గంలో 117 గ్రామ పంచాయతీలకు గాను బీఆర్ఎస్ మద్దతుదారులు ఏకంగా 80 స్థానాల్లో గెలుపొందారు.

ఈ ఫలితాలపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టి. రామారావు హర్షం వ్యక్తం చేశారు. "గత రెండు దశాబ్దాలుగా సిరిసిల్ల ప్రజలతో మా పార్టీకి ఉన్న అనుబంధం ఎంత బలమైనదో ఈ ఫలితాలు మరోసారి తేల్చిచెప్పాయి. ఉద్యమ పార్టీగా ఉన్నా, అధికార పార్టీగా ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండానే గుండెల్లో పెట్టుకున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరిగిన ఎన్నికల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం



24 గ్రామ పంచాయతీలకే పరిమితమై చతికిలపడిందని కేటీఆర్ పేర్కొన్నారు. దాదాపు 50కి పైగా గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయి మూడో స్థానానికి పరిమితమయ్యారని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సొంత మండలమైన ముస్తాబాద్‌లో కాంగ్రెస్ కేవలం మూడు పంచాయతీల్లోనే గెలవడం ఆ పార్టీ పరిస్థితిని స్పష్టం చేస్తోందన్నారు.

అలాగే, బీజేపీ పరిస్థితి కూడా

మిగితా 4వ పేజీలో

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లు డిస్మిస్



- పార్టీ మారినట్టు ఆధారాల్లేవని ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్
- న్యాయ పోరాటం చేస్తాం : బీఆర్ఎస్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫిరాయింపుల కేసులో స్పీకర్ కీలక తీర్పు ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేశారు. పార్టీ ఫిరాయించినట్లు ఎక్కడా స్పష్టమైన ఆధారాలు లేవని స్పీకర్ పేర్కొంటూ, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. అరెకపూడి గాంధీ, తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్ నిరాకరించారు. పార్టీ ఫిరాయించినట్లు ఎక్కడా ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వాదనతో స్పీకర్ ఏకీభవించలేదని తెలిపారు.

సాంకేతికంగా ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ సభ్యులుగానే ఉన్నారనీ, వారు పార్టీ మారినట్టు ఎలాంటి ఆధారాలు లేవని తీర్పులో పేర్కొన్నారు. ఐదుగురు శాసనసభ్యులు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేక పోయారనీ, అందువల్ల అనర్హతవేటుకు తగిన ఆధారాలు లేవనీ, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టుగా తీర్పులో స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు అసెంబ్లీకి వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్ ప్రకారం మూడున్నర గంటలకు ట్రిబ్యునల్ చైర్మెన్‌గా ఓపెన్ కోర్టులో 'ఈ ఐదుగురు ఎమ్మెల్యేలుగా కొనసాగుతారు' అనే సింగిల్‌లైన్ స్టేట్‌మెంటు ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఈ తీర్పుతో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీకి భారీ ఊరట లభించింది. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఓపెన్‌కోర్టులో వెలువరించిన తీర్పు కార్యక్రమా నికి రాగా, తీర్పు ఇచ్చిన తర్వాత మీడియా పాయింట్‌కు మరో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు.

**నేడు మరోతీర్పు**

మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో 8 మందికి సంబంధించి స్పీకర్ విచారణ పూర్తిచేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లను సంబంధించిన విచారణ ఇంకా పూర్తికాలేదు. ఆ ఇద్దరు మరింత సమయం కోరడంతో విచారణ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తిచేసిన స్పీకర్, బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్‌కుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. సుప్రీం తీర్పు సమయానికంటే ముందే స్పీకర్ తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

## న్యాయ పోరాటం కొనసాగిస్తాం

- ట్రిబ్యునల్ చైర్మన్‌గా స్పీకర్ విఫలమయ్యారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిబ్యునల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించడంలో స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. స్పీకర్ తీర్పు వెలువరించిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్తొ కలిసి కేపీ వివేకానంద మాట్లాడారు. ఫిరాయింపులను అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాహాటంగానే సమర్థించుకున్నారని గుర్తుచేశారు. సీఎం వ్యాఖ్యలకు అనుగుణంగానే స్పీకర్ ఈరోజు తీర్పునిచ్చారని మండిపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ ఇచ్చిన తీర్పును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కేపీ వివేకానంద వ్యాఖ్యానించారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కోసం పనిచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలు, పోస్టర్లలో ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫొటోలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తామని కేపీ వివేకానంద స్పష్టం చేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై మాత్రమే తీర్పు ఇచ్చిన స్పీకర్, మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేల విషయమై ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం ఇవ్వలేదని విమర్శించారు. ఫిరాయింపు కేసుల

మిగితా 4వ పేజీలో

## పంచాయతీ ఎన్నికల తీర్పుతో కాంగ్రెస్ పతనం ప్రారంభం

- రానున్న ప్రతి ఎన్నికల్లో ఆ పార్టీకి మరింత పరాభవం తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) అన్నారు. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ రానున్న ప్రతి ఎన్నికల్లో మరింత పతనం కాక తప్పదని స్పష్టం చేశారు.

గత రెండు సంవత్సరాలుగా ప్రజలను అన్ని అంశాల్లో మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీలు, అనేక హామీల ఆశ చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని మోసం చేసిందని ఆరోపించారు. అందుకే గ్రామస్థాయిలోనే ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు ముందు ప్రధాన ప్రతిపక్షంపై అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ప్రజలు ఇచ్చిన తీర్పును చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. ఏ పరిస్థితుల్లోనైనా తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి పోరాడేది భారత రాష్ట్ర సమితి మాత్రమేనని ఈ ఎన్నికల్లో ప్రజలు మరోసారి నిరూపించారని అన్నారు. కాంగ్రెస్ అధికార దుర్వినియోగం, బల ప్రయోగం, హింసను తట్టుకొని బీఆర్ఎస్‌కు భారీగా పంచాయతీలను కట్టబెట్టారని పేర్కొన్నారు.

మిగితా 4వ పేజీలో

## మూడు విడతల్లో హస్తం హవా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరిగిన పోలింగ్‌లో అన్నింటా హస్తం హవా కొనసాగింది. రాష్ట్రంలో మొత్తం12,728 సర్పంచ్ స్థానాలను ప్రభుత్వం నోటిపై చేసింది. ఇందులో 22 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండు స్థానాలపై కోర్టు స్టే విధించింది. 1,207 స్థానాలు ఏకగ్రీవం కాగా 11,497 స్థానాలకు పోలింగ్ జరిగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ సహా 28 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటింది. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు పెద్దఎత్తున గెలుపొందారు. సిద్దిపేట, కుమరంభీం ఆసిఫాబాద్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆ పార్టీ మద్దతుదారులు గట్టి పోటీ ఇచ్చారు. రెండో విడతలో నిర్మల్ జిల్లాలో అనూహ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వెనక్కి నెట్టి బీజేపీ మద్దతుదా రులు మెజార్టీ స్థానాలను దక్కించుకున్నారు. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాలను దక్కించుకోగా, బీఆర్ఎస్ రెండవ స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 53, బీఆర్ఎస్ 27.5, బీజేపీ 5.5, ఇతరులు 14 శాతం స్థానాలను దక్కించుకున్నారు. సర్పంచ్ స్థానాల్లో గణనీయ మైన స్థానాలు దక్కించుకున్న నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. సర్కార్ మౌఖిక ఆదేశాల మేరకు అధికారులు తగిన కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ మొదలగు 25 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటింది. కుమరంభీం ఆసీఫాబాద్, మెదక్, గద్వాల జిల్లాల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలకు గెలుచుకుంది. మహబూబ్‌నగర్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో రెండో విడతలో అత్యధిక స్థానాలు దక్కించుకున్న బీజేపీ, మూడో విడతలోనూ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది

## గాంధీజీ ఆశయాలను అవమానించే కుట్ర

- ఉపాధి హామీ పథకాన్ని బలహీనపర్చే యత్నం
- వీబీ-జీ రామ్ జీ బిల్లును వెనక్కి తీసుకోవాలి
- రాహుల్ గాంధీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఉపాధి హామీ పథకం స్థానంలో 'వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్'ను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ మార్పు ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను అవమానించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఇప్పటికే దేశ యువతను నిరుద్యోగపు ఊబిలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ పేదల ఉపాధికి ఉన్న భరోసాను కూడా తొలగించేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

**ప్రధానికి ఆ రెండు విషయాలంటే ద్వేషం**

ప్రధాని మోదీకి రెండు విషయాలంటే తీవ్ర ద్వేషమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మొదటిది మహాత్మాగాంధీ ఆదర్శాలు, రెండోది పేదల హక్కులని విమర్శించారు. గ్రామాల స్వయం పాలన అనే గాంధీజీ స్వప్నానికి ప్రతిరూపమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది గ్రామీణ పేదలు ఉపాధి పొందుతున్నారని, కరోనా సంక్షోభ కాలంలోనూ పేద కుటుంబాలకు ఇదే ప్రధాన ఆర్థిక దన్నుగా నిలిచిందన్నారు. గత పదేళ్లుగా ఈ పథకాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పుడు దాన్ని పూర్తిగా తొలగించేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఉపాధి హామీ పథకం ప్రజలకు ఉపాధి హక్కు, గ్రామాల స్వయం పాలన, కూలీల వేతనాల భారం పూర్తిగా కేంద్రం భరించడం, పనుల మెటీరియల్ ఖర్చుల్లో 75 శాతం కేంద్రం భరిస్తుందనే మూడు సూత్రాలపై అమలులోకి వచ్చిందని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. అయితే ఇప్పుడు ఈ పథకం నిధులు, నిబంధనలన్నింటినీ కేంద్రం తన చేతుల్లోకి తీసుకుని, ఖర్చుల్లో 40 శాతం రాష్ట్రాలపై మోపాలని యత్నిస్తోందని విమర్శించారు. పంటకోత సీజన్‌లో తగిన బడ్జెట్ అందుబాటులో లేకపోతే ఉపాధి హామీ పథకం అమలు కాకపోయే ప్రమాదం ఉందని, దాంతో దాదాపు రెండు నెలల పాటు గ్రామీణ పేదలకు పని దొరకదని హెచ్చరించారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త బిల్లు గాంధీజీ ఆశయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రజా వ్యతిరేక చర్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పల్లె వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రతిచోటా ఈ బిల్లుపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

- హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం, మంత్రులు



వివరాలు 4వ పేజీలో




### జనవరి 1 నుంచి
## భారత్ ట్యాక్సీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత ప్రభుత్వం మద్దతు ఇచ్చిన చొరవ లో భాగంగా జనవరి 1 నుండి ఢిల్లీలో భారత్ టాక్సీ యాప్ ప్రారంభించనున్నది. ఓలా,ఉబర్, ర్యాపిడో లాం టి సంస్థల దోపిడీని నియంత్రించేలా భారత్ ట్యాక్సీని పెట్టాలంటూ ఏఐఆర్‌డీడబ్ల్యూఎఫ్ కేంద్రం దృష్టికి తెచ్చింది. ప్రయాణికులకు మేలు జరిగేలా చర్యలు తీసు కోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో భారత్ ట్యాక్సీ కొత్త ప్లాట్‌ఫామ్ అందుబాటులోక రానున్నది. అయితే ముందుగా ఢిల్లీలో ప్రారంభమై..అనంతరం దేశవ్యాప్తంగా సేవలందించనున్నది.

రద్దీ సమయాల్లో ఓలా, ఉబర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో తరచుగా భారీ చార్జీల పెరుగుదలను ఎదుర్కొనే ప్రయాణికులకు ఈ యాప్ ఉపశమనం కలిగిస్తుందని భావిస్తున్నారు. స్థిరమైన చార్జీలపై దృష్టి సారించి, మరింత పారదర్శక ధరల నిర్మాణాన్ని అనుసరించాలని భారత్ టాక్సీ యోచిస్తోంది. భారత్ టాక్సీ యాప్ యొక్క ముఖ్య ముఖ్యాంశాలలో ఒకటి డ్రైవర్లకు దాని ఆదాయ నమూనా. డ్రైవర్లు మొత్తం చార్జీలలో 80 శాతం కంటే ఎక్కువ పొందుతారు. ఇది ప్రయివేట్ క్యాబ్ అగ్రిగేటర్లు ప్రస్తుతం అందిస్తున్న దాని కంటే చాలా ఎక్కువ. ఈ చర్య డ్రైవర్ ఆదాయాలను మెరుగుపరుస్తుందని , అధిక కమీషన్లపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని భావిస్తున్నారు. ఢిల్లీ డ్రైవర్లలో భారత్ ట్యాక్సీపై ఆసక్తి పెరుగుతోంది. ప్రారంభానికి ముందే దాదాపు 56,000 మంది డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ఇది డ్రైవర్ సమాజంలో విస్తృత ఆమోదాన్ని సూచిస్తుందని డ్రైవర్ల సంఘాలు పేర్కొంటున్నాయి. భారత్ టాక్సీ యాప్ ఆటో–రిక్షాలు, కార్లు, బైక్‌లలో రవాణా సేవలను అందిస్తుంది, వినియోగదారులు వారి అవసరాల ఆధారంగా వివిధ ప్రయాణ రీతులను ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంది. పట్టణ చలనశీలత రంగంలో ప్రభుత్వ మద్దతుగల ప్రత్యామ్నాయాన్ని ప్రోత్సహించేటప్పుడు, ప్రయాణీకులు, డ్రైవర్లు ఇద్దరికీ సరసమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ఈ చొరవ లక్ష్యం.

# రోడ్డు ప్రమాదం లో యువకుడి మృతి

- స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి మృత్యువు ఒడిలోకి
- రేపాక గ్రామంలో విషాద ఛాయలు




**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

స్నేహితుని పుట్టిన రోజు వేడుకలుకు హాజరు కావడానికి వెళ యువకుడు మృత్యువు వొడిలోకి వెళ్ళాడు. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన గుర్రం శరత్ రెడ్డి (20) అనే యువకుడు మంగళ వారం సాయంత్రం హైదరాబాద్ లోని మెడికవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గ్రామస్తుల కథనం ప్రకారం ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన శరత్ రెడ్డి సోమవారం తన మిత్రుతో కలిసి పల్సర్ బైక్ పై రేపాక నుంది కరీంనగర్ లో తన స్నేహితుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడానికి వెళ్ళాడు. వెళ్తున్న క్రమంలో అల్గునూర్ ఈనాడు కార్యాలయం సమీపంలో స్కూటీ ఎదురు వచ్చి ఢీకొంది. బైక్ ను ఆపే ప్రయత్నంలో బైకు బ్రేకులు వేయగా ప్రమాద వశాత్తు బైకు పల్టీలు కొట్టి దూరంగా ఎగిరి పడడంతో యువకుడు శరత్ రెడ్డి తలకు బలమైన గాయమై రక్త స్రావం జరిగింది. వెంటనే గాయపడ్డ యువకున్ని కరీంనగర్ ప్రయివేటు హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించగా వైద్యులు హైదరాబాద్ కు మెరుగైన వైద్యం కొరకు తరలించాలని సూచించగా కుటుంభ సభ్యులు హైదరాబాద్ మెడికవర్ హాస్పిటల్ కు తరలించారు. హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యం కొరకు ప్రయత్నాలు కొనసాగించినప్పటికి ఫలితం లేక యువకుడు శరత్ రెడ్డి మృలితి చెందాడు. గుర్రం లావణ్య- శ్రీనివాస్ రెడ్డి దంపతులకు ఇద్దరూ కొడుకులు కాగా పెద్ద కొడుకు చందు రెడ్డి, చిన్న కొడుకు శరత్ రెడ్డి. మృలితి చెందిన చిన్న కొడుకు శరత్ రెడ్డి కరీంనగర్ లోని స్థానిక డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. యువకుని మృతితో రేపాక గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# సింగరేణి సంస్థ సీఎండీగా రాజన్న సిరిసిల్ల జిల్లా తొలి కలెక్టర్ కృష్ణ భాస్కర్



**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళ తున్న నేపథ్యంలో సింగరేణికి సీఎండీ (ఎఫ్ఏసీ)గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన సింగరేణి భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుత ఛైర్మన్ ఎన్. బలరామ్ నుండి బాధ్యతలను తీసుకున్నారు. ఆయనకు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు.

డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులస్పెషల్ సెక్రటరీగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక శాఖకు స్పెషల్ సెక్రటరీ గానూ వ్యవహరించారు.




# ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్ పరిశీలన

## వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో సందర్శన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. వీర్నపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముస్తాబాద్ మండల కేంద్రం, ఆవునూర్ పాఠశాలల్లో, ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, మండల ప్రత్యేక అధికారులు రాఘవేందర్, క్రాంతి కుమార్, ఎంపీడీఓలు లక్ష్మీనారాయణ, శ్రీలేఖ, నటరాజ్, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



# ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

**బలగం టీవీ, ముస్తాబాద్:**

ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎస్పీ బుధవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా సమీక్షించారు.

## పసుపు రైతాంగం సంక్షేమానికి

# టర్మరిక్ సమ్మిట్ బాటలు వేయాలి.

- రైతు ఆధారిత పథకాలకు సమ్మిట్ లో మేధో మథనం జరగాలి.
- పసుపు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలి
- వ్యవసాయ ఉత్పత్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకం
- టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ - 2025 లో మంత్రి తుమ్మల



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో పండే పసుపును ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో ఈ రోజు సీఐఐ తెలంగాణ మరియు నేషనల్ టర్మరిక్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ %–% 2025 లో పాల్గొన్న మంత్రి, పసుపు రైతుల సంక్షేమం, విలువ జోడింపు, ఎగుమతుల అవకాశాలపై విస్తృతంగా మాట్లాడారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన Telangana Rising Global Summitలో Agri Vision 2047 ను ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఈ విజన్‌లో వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ రంగంగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన ఇంజన్‌గా చూస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అగ్రి విజన్‌లో పసుపుకి కూడా పాత్ర ఉందని మంత్రి అన్నారు.

పసుపు మనకు కొత్త పంట కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమై ఉందని మంత్రి అన్నారు. వంటింటికే పరిమితం కాకుండా, మెడిసిన్, న్యూట్రా స్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ వంటి రంగాల్లో పసుపు వినియోగం పెరుగుతోందని వివరించారు.

మంత్రి మాట్లాడుతూ.. ""ప్రపంచ వ్యాప్తంగా పసుపు సాగులో భారత్ అగ్రస్థానంలో ఉంది. పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. పసుపును అధికంగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి. నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఆర్మూర్ పసుపుకు %+క్ష్మీ% ట్యాగ్ రావడం తెలంగాణ రైతులకు గర్వకారణం" అని అన్నారు.

నిజామాబాద్ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బోర్డు కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశ చూపే సంస్థగా పనిచేయాలని, పరిశోధనను రైతు పొలాలకు తీసుకెళ్లాలని, మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని కోరారు.

తెలంగాణలో అనుకూల వాతావరణం, శ్రమించే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చు, తగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక క్వింటా పసుపు ఉత్పత్తికి రైతు రూ.8,000%–%9,000 వరకు ఖర్చు చేస్తుండగా, మార్కెట్ ధరలు రూ.12,000 అటు ఇటుగా మాత్రమే ఉండటం రైతులను నిరుత్సాహపరుస్తోందన్నారు.

నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047 కు అనుగుణంగా పనిచేసి, ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు రైతులకు అందించాలన్నారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు.

RARE అగ్రి విజన్‌లో ప్రతిపాదించినట్టుగా అధిక కర్క్యూమిన్ రకాలను రైతులకు అందించడంతో పాటు, నాణ్యమైన టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ప్రపంచ ప్రమాణాలకు తగ్గ పసుపు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడు మాత్రమే తెలంగాణ పసుపు ప్రపంచ మార్కెట్లలో స్థిరంగా నిలబడుతుందని తెలిపారు.


అలాగే, విజన్ 2047 ప్రకారం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ లో పసుపును భాగం చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ వంటి పంటల్లో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పసుపు వంటి స్పైస్ పంటలను అంతరపంటలుగా సాగు చేయడం ద్వారా రైతులకు తక్కువ రిస్క్‌తో అధిక ఆదాయం లభిస్తుందన్నారు.

రైతులు ముడి పసుపును మాత్రమే అమ్మకుండా, విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. పసుపు భవిష్యత్ ముడి పంటలో కాదు, విలువ ఆధారిత ఉత్పత్తుల్లోనే ఉందని స్పష్టం చేశారు. పసుపు ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, న్యూట్రాస్యూటికల్స్, ఇమ్యూనిటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కర్క్యూమిన్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి ఉత్పత్తుల తయారీకి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీంతో డిమాండ్ పెరిగి, రైతుల ఆదాయం పెరుగుతుందని, అప్పుడే తెలంగాణ రాష్ట్రం పెట్టుకున్న విజన్ 2047 లోని అగ్రి విజన్ లక్ష్యాలకు చేరువ అవుతామని మంత్రి అన్నారు.

ఈ సమావేశంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, టర్మరిక్ బోర్డు సెక్రటరీ భవానీ శ్రీ, సిఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, అగ్రి యూనివర్సిటీ మాజీ విసి ప్రవీణ్ రావు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్, సింథైట్ ఇండస్ట్రీస్ స్ట్రాటజిక్ సోర్సింగ్ హెడ్ జయశంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే ఫలితాలు..

- రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్
- రేవంత్ పాలనలో పల్లెలకు అవార్డులు బంద్.. అభివృద్ధి బంద్..
- ఓటమి భయంతోనే డబ్బు సంచులు, పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రలోభాలు.
- వచ్చేది వన్ నేషన్ వన్ ఎలక్షన్.. రెండు ఏండ్లలో మళ్ళీ కేసీఆర్ సీఎం కావడం ఖాయం.
- మాజీ మంత్రి హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలం మల్క్యాపూర్, కోనైపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో గెలిచిన సర్పంచులు, అలాగే అచ్చంపేట నియోజకవర్గం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత మండలం వంగూరులో 10 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ సర్పంచులు ఈరోజు హైదరాబాద్ లో మాజీ మంత్రి హరీష్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి సొంత గడ్డపై కాంగ్రెస్ ప్రలోభాలను తట్టుకొని నిలబడిన వంగూరు సర్పంచులను, అలాగే గజ్వేల్ సర్పంచులను హరీష్ రావు గారు ప్రత్యేకంగా అభినందించి, శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ "స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయి. ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలింది. మొదటి దఫా ఫలితాలు చూసి షాక్ అయ్యారు..రెండో దఫా ఫలితాలు చూసి మైండ్ బ్లాక్ అయ్యింది. ఇక ఈ రాత్రి వచ్చే మూడో దశ ఫలితాలు కూడా కాంగ్రెస్ పార్టీనీ నిరాశపరచక తప్పదు.ఈ ఓటమి భయంతోనే ఇప్పుడు డబ్బు సంచులు పట్టుకొని హైదరాబాద్ నుండి బయలుదేరారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు.

కేసీఆర్ నాయకత్వంలో తూప్రాన్ మండలమే కాదు రాష్ట్రం మొత్తం అద్భుతంగా అభివృద్ధి చెందింది. తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. నాడు ఢిల్లీలో అవార్డులు ఇస్తే తెలంగాణ పల్లెల పేర్లు లేకుండా జాబితా ఉండేది కాదు. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో తెలంగాణకు ఒక్క అవార్డు కూడా రాలేదు. పల్లెలు అపరిశుభ్రంగా మారాయి. కనీసం కేసీఆర్ గారు కొనిచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదు. ఆనాడు కేసీఆర్ గారు ప్రతి నెలా పల్లెలకు నిధులు విడుదల చేసేవారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు బంద్ అయ్యాయి. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డు అన్నీ మూలకు పడ్డాయి. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు కాబట్టే.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు.

కాంగ్రెస్ నాయకులను నేను హెచ్చరిస్తున్నా.. మా కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు. దాడులు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి. బీఆర్ఎస్ లో గెలిచిన వారిని బలవంతంగా పార్టీలో చేర్చుకోవాలని చూసినా కుదరదు.. ఎందుకంటే బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకారులని గుర్తుంచుకోండి. వారు మీ బెదిరింపులకు లొంగరు. దేశం వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా వెళ్తోంది. బహుశా మరో ఆరు నెలల్లోనో ఏడాదిలోనో ఎన్నికలు రావచ్చు. రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మళ్ళీ కేసీఆర్ గారే ముఖ్యమంత్రి అవుతారు. గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండండి. మళ్ళీ గ్రామాలకు మంచి రోజులు వస్తాయి. అభివృద్ధి పథంలో మన గ్రామాలన్నీ ప్రయాణిస్తాయి.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్.



కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

- **ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో సందర్శన**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ముస్తాబాద్ మండల కేంద్రం, నామాపూర్, గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గంభీరావుపేట లోని కేజీ టూ పీజీ విద్యాలయం, ఎల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రం, ఆవరణలో పరిశీలించారు.

ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారా అని ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశార. ఈ పరిశీలనలో ఏఎస్పీ చంద్రయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, హనుమంతు, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు రాంచందర్, మారుతి రెడ్డి, సుజాత, ఎంపీడీఓలు లచ్చాలు, శ్రీధర్, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించిన అదనపు కలెక్టర్

**ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సందర్శన**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, అల్మాస్ పూర్, గొల్లపల్లి, వీర్నపల్లి మండలంలోని కంచర్ల, వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఆవరణ, కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్లు సుజాత, ముక్తార్ పాషా, ఎంపీడీఓలు శ్రీలేఖ, నటరాజ్, ఎంపీఓలు తదితరులు ఉన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు..



- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంబిరావుపేట, ముస్తాబద్ మండలాలలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి బందోబస్తులో ఉన్న అధికారులకు,సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు. మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పెట్రోలింగ్ వాహనాలు,ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

**పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పలు గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఎస్పీ జిల్లాలోని పలు కీలక గ్రామాలలో పర్యటించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

వీర్నపల్లి, కంచెర్ల, గర్జనపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అలాగే ఎల్లారెడ్డిపేట, వెంకటాపుర్, గొల్లపల్లి, బొప్పపూర్ గ్రామాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ పలు భద్రతాపరమైన సూచనలు చేశారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని, పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు ఉండకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు నిఘా ఉంచాలని, ఎటువ ంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహిం చాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలని సిబ్బందిని కోరారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, పోలీసు యంత్రాంగం ప్రజలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా ఇచ్చారు.



## సిరిసిల్లలో ఉచిత ఆరోగ్య శిబిరం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌లో మంగళవారం నాడు INFOCEM (Integrated Network for Community Empowerment) సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ ఆరోగ్య శిబిరం కార్యక్రమాన్ని INFOCEM ప్రాజెక్టు డైరెక్టర్ శాత్రవేణి మహేష్ సిరిసిల్ల నేతృత్వంలో చేపట్టారు. ఈ శిబిరంలో పాల్గొన్న సుమారు 30 మందికి హెచ్ఐవి రక్త పరీక్షలతో పాటు, హెపటైటిస్–ఎ, హెపటైటిస్–బి వంటి కీలకమైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆరోగ్య పరిరక్షణ మరియు వ్యాధుల నివారణ పద్ధతులపై పాల్గొన్న వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో INFOCEM సంస్థకు చెందిన ఓఆర్‌డబ్ల్యూ శ్రీకాంత్, పీఈ శ్రీనివాసు మరియు కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# పోలింగ్ కేంద్రంలో ఎస్ఐ మానవత్వం..

- **వృద్ధురాలి ఓటు హక్కు వినియోగానికి చేయూత..!**
- **పోలింగ్ కేంద్ర ఆవరణలో వృద్ధులకు, దివ్యాంగులకు బాసటగా నిలుస్తున్న పోలీసులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవడనికి వచ్చిన వృద్ధురాలి సహాయకంగా నిలిచిన ఎస్.ఐ. వెంకట్రాజం. రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం, వెంకటాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చిన ఓ వృద్ధురాలికి ఎస్.ఐ. (సబ్–ఇన్‌స్పెక్టర్) సహాయకంగా నిలిచి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. వృద్ధాప్యం కారణంగా నడవడానికి ఇబ్బంది పడుతున్న ఆ వృద్ధురాలు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకోవడంలో కాస్త తడబడ్డారు. దీనిని గమనించిన పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్.ఐ. వెంటనే ఆమె వద్దకు వెళ్లి, ఆసరాగా చేయి అందించి, పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లారు. ఓటు వేసే వరకు వృద్ధులకు అండగా ఉండి, ఓటు హక్కు వినియోగించుకునేలా చూశారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో పౌరులకు సహాయపడటం తమ విధిగా భావించిన పోలీసుల చర్యను స్థానికులు మరియు పోలింగ్ సిబ్బంది అభినందించారు.

# ఐపీఎల్‌లోకి కరీంనగర్ కుర్రాడు..

- **రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఎంపికైన అమన్ రావు!**

**బలగం టీవీ, హైదరాబాద్**




కరీంనగర్ జిల్లాకు చెందిన యువ సంచలనం పేరాల అమన్ రావు ప్రతిష్టాత్మక ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అడుగుపెట్టబోతున్నారు. అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ ఈ 21 ఏళ్ల యువ బ్యాటర్లను రూ. 30 లక్షల బేస్ ప్రైస్‌కు సొంతం చేసుకుంది. కరీంనగర్ జిల్లా నుంచి ఐపీఎల్‌కు ఎంపికైన తొలి ఆటగాడిగా అమన్ రావు సరికొత్త చరిత్ర సృష్టించారు. అమన్ రావు స్వస్థలం కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలం, వెన్నంపల్లి గ్రామానికి చెందినవారు. ప్రస్తుతం వీరి కుటుంబం హైదరాబాద్‌లో నివసిస్తోంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరపున అండర్–19, అండర్–23 విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేశారు. ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో 160కి పైగా స్ట్రైక్ రేట్‌తో రెండు మెరుపు అర్ధ సెంచరీలు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. అమన్ తండ్రి మధుసూదన్ రావు గతంలో జిల్లా స్థాయి క్రికెటర్. తండ్రి ప్రోత్సాహంతోనే అమన్ చిన్నతనం నుండి క్రికెట్‌లో శిక్షణ పొందారు.

# గీతం యూనివర్సిటీ రూ.118 కోట్ల విద్యుత్ బకాయిలపై హైకోర్టు సీరియస్..

**'పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయమా?' అంటూ న్యాయమూర్తి ఆగ్రహం.**

**బలగం టీవీ, హైదరాబాద్**




హైదరాబాద్‌లోని గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) యూనివర్సిటీకి ఉన్న భారీ విద్యుత్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ చెల్లించాల్సిన రూ.118.13 కోట్ల పెండింగ్ విద్యుత్ బకాయిలపై విద్యుత్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేశారు. "సామాన్యులకు ఒక చట్టం, డబ్బు ఉన్న వాళ్లకు ఒక చట్టం రూపొందించారా?" అంటూ కోర్టు ప్రశ్నించింది. తన చిన్నతనంలో రూ.800 బిల్లు చెల్లించకపోతే తన ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారని గుర్తుచేస్తూ, "పేదలకు ఒక న్యాయం, పెద్దలకు ఒక న్యాయం ఉంటుందా?" అని హైకోర్టు న్యాయమూర్తి మండిపడ్డారు. విద్యుత్ కనెక్షన్ తొలగించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారా అని ప్రశ్నించారు. పదవుల్లో ఉన్న వారి పట్ల అధికారులు ఇలా వ్యవహరిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని జస్టిస్ నగేష్ భీమపాక తీవ్రంగా హెచ్చరించారు. ఈ విషయంపై వివరణ ఇవ్వాల్సిందిగా టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌ను స్వయంగా కోర్టుకు హాజరుకావాల్సిందిగా ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి కేసును వాయిదా వేసింది. హైకోర్టు.

# మూడో విడతలో కాంగ్రెస్‌దే పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా మూడో విడతలో 182 మండలాల్లోని 3,752 పంచాయతీలు, 75,725 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.56 శాతం, ఆ తర్వాత మెదక్ జిల్లాలో 90.68, సూర్యాపేటలో 89.25, శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.45 శాతం, ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాలో 79.14, జగిత్యాలలో 79.64 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ తర్వాత క్రమంగా పుంజుకుని పోలింగ్ ముగిసే సమయానికి 85.77 శాతానికి చేరుకుంది. మూడో విడతలో ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 50,56,344 మంది ఓటర్లకు గాను 43,37,024 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇందులో 21,21,269 మంది పురుషులు (86.59 శాతం), 22,15,683 మంది మహిళలు (85.96 శాతం), 72 మంది ఇతరలు (50.70 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది. .

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం బానాపూర్ గ్రామంలో సర్పంచి ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా జరిగాయి. కాంగ్రెస్ మద్దతుదారుడు పుప్పాల అనిల్ 241 ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ మద్దతుదారుడు పుప్పాల శంకర్‌కు 240 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో అనిల్ విజయం సాధించారు. రీకౌంటింగ్ నిర్వహించినప్పటికీ ఫలితంలో ఎలాంటి మార్పు రాలేదు.

**మూడో విడతలో 85.76 పోలింగ్**

చివరి దశ పంచాయతీ ఎన్నికల్లో 85.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ వివరాలను వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడో విడతలో 182 మండలాల్లోని 3,752 పంచాయతీలు, 75,725 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.56 శాతం, ఆ తర్వాత మెదక్ జిల్లాలో 90.68, సూర్యాపేటలో 89.25, శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.45 శాతం, ఆ తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాలో 79.14, జగిత్యాలలో 79.64 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ తర్వాత క్రమంగా పుంజుకుని పోలింగ్ ముగిసే సమయానికి 85.77 శాతానికి చేరుకుంది. మూడో విడతలో ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 50,56,344 మంది ఓటర్లకు గాను 43,37,024 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇందులో 21,21,269 మంది పురుషులు (86.59 శాతం), 22,15,683 మంది మహిళలు (85.96 శాతం), 72 మంది ఇతరలు (50.70 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది. .

# కొత్త డిస్కంకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్–స్టేట్ సోలార్, సీజీఎస్, ఐపీపీలతో ఎస్పీడీసీఎల్‌కు 70.55, ఎన్పీడీసీ ఎల్‌కు 29.45 శాతం ఉన్న పవర్ పర్చేస్ అగ్రిమెంట్‌కు అనుగుణంగా మూడో డిస్కంకు విద్యుత్ కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలని సూచించింది. మూడో డిస్కంకు 600 ఇంజినీర్లు, 1,000 ఆర్టిజన్లు, ఓఅండ్ఎం స్టాఫ్, 340 మంది ఆడ్మినిస్ట్రేషన్ సిబ్బందిని కేటాయించాలని ప్రభుత్వం సూచించింది. మూడో డిస్కం అమల్లోకి వచ్చేనాటికి వాటి ఆస్తులు, అప్పుల ఆధారంగా ప్రత్యేక బ్యాలెన్స్ షీట్‌ను సిద్ధం చేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించే పథకాలన్ని మూడో డిస్కం పరిధిలోకి తీసుకు రానున్నారు. ఇందుకు సంబంధించిన తాజాగా ప్రతిపాదించిన విధివిదానాలకు అనుగునంగా బదిలీ చేయనున్నారు. బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించక పోవడంతో రెండు డిస్కంలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విద్యుత్ ముసాయిదా బిల్లుకనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సంస్కరించే చర్యల్లో బాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# సిరిసిల్ల గడ్డ గులాబీ అడ్డా.. మరోసారి రుజువు

(మొదటి పేజీ తరువాయి)

నిరాశాజనకంగా ఉందని తెలిపారు. బీజేపీ కేవలం 13 గ్రామ పంచాయతీల్లో మాత్రమే విజయం సాధించగలిగిందని, చాలా గ్రామాల్లో ఆ పార్టీ అభ్యర్థులు నామమాత్రపు పోటీ ఇచ్చి ఓటమి పాలయ్యారని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో బీజేపీకి గణనీయమైన ఉనికి లేదని ఈ ఫలితాలు స్పష్టంచేశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన కేటీఆర్, ఎన్నికల కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్‌పై నమ్మకం ఉంచి 80 స్థానాల్లో గెలిపించిన సిరిసిల్ల ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ఆయన అన్నారు.

# మరో 20 దేశాలపై ట్రంప్ ఆంక్షలు..

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు మరో విడతగా బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, టర్క్మెనిస్తాన్, వెనెజువెలా దేశాలపై పాక్షిక పరిమితులు విధించారు. తాజాగా బుర్కినో ఫాసో, మాలి, నైజర్, దక్షిణ సూడాన్, సిరియాను కూడా జాబితాలో చేర్చారు. అలాగే పాలస్తీనా అథారిటీ జారీ చేసిన ప్రయాణ పత్రాలు కలిగిన వారిపై కూడా అమెరికా ప్రయాణ నిషేధం అమలులోకి తీసుకొచ్చారు.

పాలస్తీనా అథారిటీ పాస్‌పోర్ట్ కలిగిన వారికి ఇప్పటికే వ్యాపారం, ఉద్యోగం, విద్య, పర్యటన నిమిత్తం అమెరికా రావడం కష్టంగా మారింది. తాజా నిర్ణయంతో అమెరికాకు వలస వెళ్లడంపై పూర్తిస్థాయి నిషేధం అమలులోకి వచ్చింది. అయితే ఈ నిషేధాలు అందరికీ వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగినవారు, గ్రీన్‌కార్డు హోల్డర్లు, దౌత్యవేత్తలు, క్రీడాకారులు, అలాగే అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమని భావించే ప్రత్యేక వీసా కేటగిరీలకు మినహాయింపులు ఉంటాయని వెల్లడించింది. ఈ ఆంక్షలు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపింది. నిషేధం విధించిన దేశాల్లో అవినీతి, నకిలీ పౌర పత్రాలు, సరైన క్రిమినల్ రికార్డుల లేమి వల్ల అమెరికా భద్రతా తనిఖీలు బలహీనపడుతున్నాయని వైట్ హౌస్ వివరించింది. అలాగే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా స్వదేశాలకు తిరిగి వెళ్లకుండా అమెరికాలోనే ఉండిపోవడం, తమ పౌరులను తిరిగి తీసుకెళ్లడంలో ఆయా ప్రభుత్వాలు సహకరించకపోవడం వంటి అంశాలను కారణాలుగా పేర్కొంది.

# పొగమంచుతో రద్దయిన నాలుగో టీ20



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్–సౌతాఫ్రికా మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం లక్నో వేదికగా జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రద్దయ్యింది. మైదానాన్ని పూర్తిగా ఘనమైన పొగమంచు కమ్మేయడంతో టాస్ కూడా పడకుండానే మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేశారు.

పొగమంచు కారణంగా ఆటగాళ్ల విజిబిలిటీ తీవ్రంగా తగ్గడంతో పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు.. ఈ పరిస్థితుల్లో ఆట కొనసాగించడం భద్రమేనికాదని నిర్ణయానికి వచ్చారు. లక్నోలో గాలి నాణ్యత సూచిక అత్యంత ప్రమాదకర స్థాయిలో 391గా నమోదైంది. దీంతో ప్రేక్షకులు నిరాశగా మైదానాన్ని విడిచిపెట్టారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 2%–%1తో ఆధిక్యంలో ఉంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్, రెండో టీ20లో పరాజయం పాలైంది. మూడో టీ20లో అద్భుత ప్రదర్శనతో గెలిచి సిరీస్‌లో ముందంజ వేసింది. నాలుగో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఖాయం చేయాలన్న భారత ఆశలను పొగమంచు నీరుగార్చింది. ఐదో, చివరి టీ20 మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది.

సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ అనంతరం జనవరిలో న్యూజిలాండ్‌తో టీమిండియా ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఫిబ్రవరిలో జరిగే ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు ముందు భారత్ ఆడే చివరి టీ20 సిరీస్ ఇదే కావడంతో, ప్రస్తుత సిరీస్ విజయం కీలకంగా మారింది. అయితే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ లేమి జట్టుకు ఆందోళన కలిగిస్తోంది.

కాలి గాయంతో సౌతాఫ్రికాతో చివరి రెండు టీ20లకు శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. నాలుగో టీ20కు ముందు ప్రాక్టీస్ సమయంలో బొటనవేలికి గాయమైందని బీసీసీఐ వెల్లడించింది. ఈ సిరీస్‌లో గిల్ వరుసగా 4, 0, 28 పరుగులు మాత్రమే చేయగా, మొత్తం 32 పరుగులకే పరిమితమయ్యాడు. గత 15 మ్యాచ్‌ల్లో 24.25 సగటు, 137.26 స్ట్రైక్‌రేట్‌తో 291 పరుగులు మాత్రమే చేయడంతో అతనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రాంతీయ శాంతి, భద్రతలో

# భారత్–ఇథియోపియా సహజ భాగస్వాములు

(మొదటి పేజీ తరువాయి)

సంకల్పమే రాష్ట్ర సంకల్పంగా మారుతుంది. ప్రజల చక్రం, రాష్ట్ర చక్రం సమన్వయంతో కదిలితే అభివృద్ధి చక్రం ముందుకు సాగుతుంది" అని వ్యాఖ్యానించారు. ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారం అందించినందుకు ఆ దేశ ప్రధాని అబియ్ అహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని భారత ప్రజల తరఫున నమ్రతతో స్వీకరిస్తున్నానని అన్నారు. ఇథియోపియా ప్రపంచంలోని అత్యంత ప్రాచీన నాగరికతల్లో ఒకటని కొనియాడిన మోదీ, ఈ దేశ చరిత్ర ప్రజల హృదయాల్లో జీవిస్తోందని చెప్పారు. భారత్–ఇథియోపియా సాంస్కృతిక అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, భారత జాతీయ గీతం లివందేమాతరంలిలోనూ, ఇథియోపియా జాతీయ గీతంలోనూ భూమిని తల్లిగా పేర్కొనడం విశేషమని తెలిపారు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్ మార్గదర్శకంగా మేమూ భవిష్యత్తు వైపు ధైర్యంగా అడుగులు వేస్తున్నాం. మాతృభూమిపై ప్రేమ రెండు దేశాల భావోద్వేగాల్లో ఒకటే" అని అన్నారు.

ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో విస్తృత స్థాయి చర్చలు జరిపిన మరుసటి రోజే మోదీ ఈ ప్రసంగం చేశారు. ఈ భేటీలో భారత్%–%ఇథియోపియా సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా వర్ణించారు. ఆహార, ఆరోగ్య భద్రత, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఔషధాలు, వైద్య పర్యటన, శక్తి రంగం, కీలక ఖనిజాలపై సహకార అంశాలపై చర్చలు జరిగినట్లు వెల్లడించారు.

మరోవైపు, ఇథియోపియన్ సింగర్లు భారత జాతీయ గేయం లివందేమాతరం ఆలపించిన వీడియోను ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భంలో ఈ గీతాన్ని ఆలపించడం తనను కదిలించిందని ఆయన పేర్కొన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇథియోపియాకు వెళ్లిన మోదీకి మంగళవారం సాయంత్రం ప్రధాని అబియ్ అహ్మద్ అలీ విందు ఏర్పాటు చేయగా, ఆ కార్యక్రమంలో సింగర్లు లివందేమాతరంలిను ఆలపించారు. వీడియో వైరల్‌గా మారింది. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన లివందేమాతరంలికు 150 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వార్షికోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ తరుణంలో ఇథియోపియాలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ సింగర్లు గేయాన్ని ఆలపించడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.

# న్యాయ పోరాటం కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విచారణను ఆలస్యం చేస్తే చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించడంతోనే స్పీకర్ ఈ తీర్పు ఇచ్చారని ఆరోపించారు. స్పీకర్ నోటీసులకు కడియం శ్రీహరి, దానం నాగేందర్ నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదని, అయినప్పటికీ వారిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేపీ వివేకానంద తెలిపారు. అసెంబ్లీ రూల్స్ బుక్ ప్రకారం జడ్జిమెంట్ కాపీ తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీర్పు కాపీని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని స్పీకర్ చెప్పినప్పటికీ, నిజంగా జడ్జిమెంట్ తయారైందా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు గడువు ముగియబోతుండటంతో హడావుడిగా తీర్పు ఇచ్చినట్లు అనిపిస్తోందని ఆయన అన్నారు. ఒకవైపు ఫిరాయించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో ఉన్నామని చెబుతుండగా, మరోవైపు సీఎం మాత్రం ఆ 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని చెబుతున్నారని విమర్శించారు. "ఈ పరిస్థితుల్లో ఆ ఎమ్మెల్యేలు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతారు?" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేపట్టిన పోరాటం వల్లే అయినా స్పీకర్ ఈ తీర్పు ఇవ్వాల్సి వచ్చిందని, అయితే తెలంగాణ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టులో పరువు తీస్తోందని కేపీ వివేకానంద ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై న్యాయపోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

**బలగం టీవీ, హైదరాబాద్**

శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ప్రథమ పౌరులిరాలికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. ఈ నెల 22 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో హకీంపేట, బొల్లారం, అల్వాల్, తిరుమలగిరి, కార్ఖానా, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నాయి. 19న ఉదయం 11 గంటలకు ఆలిండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించనున్నారు.

# పంచాయతీ ఎన్నికల తీర్పుతో కాంగ్రెస్ పతనం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంచాయతీరాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అరాచకాలు, ప్రలోభాలు, అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొని వీరోచితంగా పోరాడి బీఆర్ఎస్ వెంట నిలిచిన ప్రతి కార్యకర్తకు, ఓటర్లకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇది సామాన్య విజయం కాదు.. చరిత్రలో నిలిచిపోయే పోరాటం" అని పేర్కొన్నారు.

"యుద్ధంలో సైనికుడిలా పంచాయతీ ఎన్నికల్లో పోరాడిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు శిరస్సు వంచి సలాం చేస్తున్నా. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ప్రతి గులాబీ సైనికుడి కళ్లల్లో కనిపించిన పౌరుషం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చింది. అరాచక కాంగ్రెస్‌ను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను మట్టికరిపించేందుకు మా శ్రేణులు చేసిన ఈ అలుపెరగని పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

పంచాయతీ ఫలితాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అధికార పక్షానికి అనుకూలంగా ఉంటాయని, అలాంటిది ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని తిరిగినా, మంత్రులు మోహరించినా కాంగ్రెస్ సగం సీట్లు సాధించేందుకు తంటాలు పడిందన్నారు. అధికార పార్టీ ఇంత తక్కువ స్థానాలకు పరిమితమవడం, ప్రధాన ప్రతిపక్షం ఇన్ని పంచాయతీలు గెలవడం చరిత్రలో లేనిదని, ఇది కాంగ్రెస్ వైఫల్యాలపై తెలంగాణ పల్లెలు మోగించిన 'జంగ్ సైరన్' అని వ్యాఖ్యానించారు.